క్లుప్తంగా

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఖాళీలు

దెందులూరు: కొవ్వలిలోని నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఖాళీలున్నాయని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సత్యనారాయణ తెలిపారు. 5 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 250 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి సౌకర్యాలతో అన్ని వసతులు కలిగి ఉన్న నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కొవ్వలిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పెట్రోలు బంకుల్లో తనిఖీలేవీ?

దెందులూరు: పెట్రోలు బంకుల్లో సంబంధిత శాఖాధికారులు పర్యవేక్షణ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. పెట్రోలు, డీజిల్ విక్రయం చేస్తున్నారే తప్ప కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బంకుల్లో వినియోగదారులకు ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. దీనిపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి బంకులో వాహనాలకు గాలి పెట్టే యంత్రం అందుబాటులో ఉండాలి. వాహనదారులు గాలి పెట్టమని బంకు సిబ్బందిని అడిగితే మరమ్మతుకు గురైందని, ఆపరేటర్ బయటకు వెళ్లాడని సమాధానం చెబుతున్నారని పలువురు ఆరోపించారు. కొన్ని బంకుల్లో ఈ సేవలు ఉండటం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఆశ్రం ఆసుపత్రి నుంచి ఏలూరు వెళ్లే దారిలో ఉన్న పెట్రోలు బంకుల్లో ద్విచక్ర వాహనాలకు గాలిపట్టడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బంకు యజమానులు, అధికారులు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

కళాకారుల పారితోషికపు బకాయిలు చెల్లించాలి

టి.నరసాపురం: కళాకారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు కోరారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి, గ్రామదర్శిని, నగరదర్శిని తదితర కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కళాకారులంతా కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి కళాకారులకు రావాల్సిన ఆర్థిక పారితోషికం ఇవ్వలేదు. అప్పటినుంచి నేటి వరకు ఆ సొమ్ములు అందక, ఆయా కార్యక్రమాల నిర్వహణ కోసం చేసిన అప్పులు తీర్చలేక కళాకారులు సతమతమవుతున్నారు. ప్రస్తుతం మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. అలాగే కళాకారులకు కళారూపాల ప్రదర్శనలకు అవకాశం ఇచ్చి ఉపాధి కల్పించడం, ప్రతి పేద కళాకారుడికి నెలకు రూ.10వేలు పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పూడిక పనులు 'కృష్ణా'ర్పణమేనా..!

- కృష్ణా కెనాల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు
- దిగువ ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి
- పట్టించుకోని ప్రభుత్వం
- అయోమయంలో రైతన్నలు



ఏలూరు రైల్వే స్టేషన్ ప్రాంతంలో పూడుకుపోయిన కృష్ణా కాలువ



తూర్పులాకులకు వెళ్లేమార్గంలో గుర్రపు డెక్క, వ్యర్థాలతో నిండిపోయిన కాలువ

ఏలూరు (టూటౌన్): ఒక పక్క ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయినా కృష్ణా కెనాల్ ఆయకట్టు పరిధిలోని రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరందక అవస్థలు పడుతున్నారు. కృష్ణాకాలువలో కనీసం పూడిక పనులు చేపట్టకపోవడంతో ఎక్కడి గుర్రపుడెక్క అక్కడే ఉంది. పూర్తి స్థాయిలో వ్యర్థాలతో నిండిపోయి సాగునీరు కిందకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో దీని ఆయకట్టు రైతులు పూర్తిగా వర్షం పైనే ఆధారపడి సాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కనీసం కాలువలు పూడికలు కూడా తీయకుండా అధికారులు, ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుకుంటుందంటూ పలు రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మరోపక్క కృష్ణా కాలువ నుంచి పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయాలంటూ రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఇవేమీ తమకు సంబంధం లేనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కృష్ణా కాలువ నీటి ద్వారా దెందులూరు నియోజకవర్గం పరిధిలోని పెదపాడు, ఏలూరు రూరల్, దెందులూరు మండలంలో కొంత మేరకు పంట పొలాలు సాగు అవుతున్నాయి. కృష్ణా కాలువ నీరు అందక పోడంతో దెందులూరు మండలంలోని దీని ఆయకట్టు రైతులు గోదావరి నీటిని ఇంజన్ల ద్వారా తోడుకోవడం లేదా చెరువుల నీటితో సాగుచేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పెదపాడు మండల రైతులు కొద్ది పాటి కృష్ణా జలాలతో పాటు వర్షం నీటి ఆధారంగా సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దీనికి భిన్నంగా ఏలూరు రూరల్ రైతుల పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి జలాలను పోణంగి పుంత ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేసినా అవి పూర్తి స్థాయిలో అందడం లేదనేది రైతుల వాదనగా ఉంది. దీంతో ఏలూరు రూరల్ మండల రైతులకు కృష్ణా కాలువ ద్వారా వచ్చే సాగునీరే ఆధారంగా ఉంది.

పూడుకుపోయిన కాలువతో రైతుల ఇక్కట్లు

కృష్ణా కాలువ ప్రధానంగా ఏలూరు నగరం మధ్య నుంచి ప్రవహిస్తుండటంతో ఈ కాలువ పెద్ద ఎత్తున వ్యర్థాలతో నిండిపోయింది. దీనికి తోడు వేసవిలో చేపట్టాల్సిన తాత్కాలిక పూడిక తీత పనులు సైతం చేయకపోవడంతో రైతులకు నీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. తక్షణమే కాలువ పూడిక తీత పనులు చేపట్టి దిగువ రైతులకు సాగు నీరు అందించాలంటూ ఈ ప్రాంత రైతులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

సాగునీరు అందని పరిస్థితి



కృష్ణా ఆయకట్టు రైతుల పరిస్థితి ముంపునకు ముందు.. సాగుకు వెనుక అనే చందంగా ఉంది. ప్రతి వేసవిలో చేపట్టాల్సిన తాత్కాలిక పూడికతీత పనులు కూడా చేపట్టకపోవడంతో దిగువ ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి తలెత్తింది. కాలువ పూడిక తీత పనులు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలి. అప్పుడే రైతుల సాగు నీటి సమస్య తీరుతుంది.

కె.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం, ఏలూరు

గుర్రపుడెక్క, తూడు తొలగించాలి



కృష్ణా కాలువలో ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, వ్యర్థాలను పూర్తిగా తొలగించాలి. ఒకపక్క ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా ప్రారంభం అయినా సాగునీరు అందక నాట్లు వేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. కృష్ణా కాలువ ఆయకట్టు శివారు ప్రాంత రైతుల సమస్యను పరిష్కరించే విధంగా ఇరిగేషన్ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి.

బైరెడ్డి లక్ష్మణరావు, కౌలురైతు, సుంకరవారి తోట, ఏలూరు

ఎస్సై కుటుంబానికి సాయం



ఎస్సై శ్రీను కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న పోలీస్ అధికారులు

ఏలూరు టౌన్: ఎస్సై కుటుంబానికి పోలీస్ బ్యాచ్‌మెట్స్ అంతా కలిసి ఆర్థిక సహాయం అందించారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాకు చెందిన ఎస్సై శ్రీరాముల శ్రీను ఇటీవల మృతిచెందారు. ఆయన 2014 ఎస్సై బ్యాచ్‌లో శిక్షణ పొందారు. ఆయన మరణించడంతో 2014 ఎస్సై బ్యాచ్ ఏపీ, తెలంగాణ వెల్ఫేర్ బ్యాచ్‌మెట్స్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీరాముల శ్రీను కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఏలూరు టూటౌన్ ఎస్సై మదీనాబాషాతోపాటు, జిల్లాలో పలువురు పోలీస్ అధికారులు ఎస్సై శ్రీను కుటుంబానికి అండగా నిలిచిన వారిలో ఉండడం విశేషం.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన బాలిక స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం కిరాణా షాపునకు వెళుతున్నట్లు తల్లికి చెప్పి బాలిక బయటకు వెళ్లింది. అయితే ఎంత సేపటికి రాకపోవడంతో బాలిక తండ్రి చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెదికారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా బోనాల జాతర ఊరేగింపు

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో ఆదివారం బోనాల జాతర పండగను ఘనంగా నిర్వహించారు. బండర్లగూడెంలోని తాటి కౌసల్య ఇంటి వద్ద నుంచి బోనాలను భక్తులు అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాన్ని తలపై ఎత్తుకొని పోతురాజు విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనతరం కనకదుర్గమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కనకదుర్గమ్మ ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని, భక్తురాలు తాటి కౌశల్య ఆధ్వర్యంలో ఆషాడ బోనాల జాతర ఊరేగింపు నిర్వహించినట్లు చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెదపాడు : ఓ వ్యక్తి అదృశ్యంపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ముళ్లపాడుకి చెందిన మేకల రాఘవులు (32) రెండేళ్లుగా పెదపాడు మండలంలోని కొత్తూరులో బతుకుదెరువు నిమిత్తం వచ్చి జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8న స్వగ్రామంలోనే చదువుకుంటున్న తన పిల్లల సర్టిఫికెట్ల కోసం కొత్తూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్ల వెతికారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. రాఘవులు తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

భారీగా ఏర్పాట్లు చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు



నగరానికి చేరుకున్న జగన్నాథుని రథం



రథంలో ఊరేగనున్న జగన్నాథ, బలదేవ, సుభద్ర విగ్రహాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నగరంలో రెండోసారి జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నారు. సోమవారం నిర్వహించనున్న ఈ రథయాత్ర నిమిత్తం ఇస్కాన్ ప్రతినిధులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక శనివారపు పేటలోని ఇస్కాన్ మందిరం వద్ద నుంచి రథయాత్ర ప్రారంభానికి సన్నాహకాలు చేస్తున్నారు. ఇప్పటికే రథం నగరానికి రాగా దానిని అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆదివారం మందిరం వద్దకు చేరుకున్న రథాన్ని, రథంలో నగర యాత్ర చేయనున్న జగన్నాథుడు, జగన్నాథుని సోదరుడు బలదేవ్, సోదరి సుభద్ర ఉత్సవ విగ్రహాలను నగరానికి చెందిన పలువురు భక్తులు సందర్శిస్తున్నారు.

రథయాత్ర సాగేదిలా..

జగన్నాథ రథయాత్ర నగరంలోని అన్ని ముఖ్య ప్రాంతాలనూ కలుపుతూ ముందుకు సాగుతుందని ఏలూరు ఇస్కాన్ మందిర అధ్యక్షుడు రాధావల్లభ దాస్ తెలిపారు. స్థానిక లునాని పార్కు వద్ద ఉన్న ఇస్కాన్ మందిరం నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ రథయాత్ర స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్, రామచంద్రరావు పేట మెయిన్ రోడ్డు, ఒన్‌టౌన్, మెయిన్ బజారు మీదుగా సాగి రామకోటి ప్రాంగణానికి చేరుకుంటుంది. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఈ యాత్రను ప్రారంభించిన అనంతరం వందలాది మంది భక్తులు నృత్యాలు, కీర్తనలతో, గానాలతో, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల మధ్య జరుగుతుంది. ఇందుకు గాను ఇప్పటికే వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 400 మంది ఇస్కాన్ ప్రతినిధులు నగరానికి చేరుకున్నారు. వీరితో పాటు నగరానికి చెందిన జగన్నాథుని భక్తులు ఈ రథయాత్ర వెంట నడవనున్నారు.

రామకోటిలో ప్రత్యేక కార్యక్రమాలు..

నగరంలోని ప్రధాన ప్రాంతాల గుండా సాగిన రథయాత్ర రామకోటి ప్రాంగణానికి చేరుకున్న అనంతరం అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇస్కాన్ ప్రతినిధులు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా సాయంత్రం 6.30 గంటల నుంచి రామకోటి ప్రాంగణంలో స్వామివారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం సమర్పించనున్నారు. అనంతరం జగన్నాథ ప్రవచనం, భక్తులందరికీ జగన్నాథ ప్రసాద విందు ఏర్పాటు చేశారు.

గొలుసుల పంజాలో ప్రత్యేక ప్రార్థనలు



గొలుసుల పంజాలో ప్రతిష్టించిన పీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న దర్గా ముజావర్లు, ముస్లింలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మొహర్రం కార్యక్రమాల్లో భాగంగా స్థానిక కుండీ సెంటర్‌లోని హజరత్ మౌలా అలీ మహాత్ముని ఆస్థాన (గొలుసుల పంజా)లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం పంజాలో ప్రతిష్టించిన పీర్లకు విశేష అలంకరణ చేసి దరూద్ సలాం పాటించారు. అనంతరం ఫాతెహా ఖానీ నిర్వహించి దివ్య ఖుర్ఆన్ గ్రంథ పఠనం చేశారు. ఈ సందర్భంగా పంజా వంశపారంపర్య ముజావర్ ఎండీ గాలబ్ అలీ మాట్లాడుతూ మొహర్రం నెలను షహీద్ (అమరవీరుల) నెలగా వర్ణిస్తూ పండుగలా కాక వర్ధంతిలా జరుపుకుంటామన్నారు. భారతదేశ ప్రజలంతా సోదరభావంతో మెలుగుతూ క్షేమంగా, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి అందరూ ఆరోగ్యంగా, సుఖశాంతులతో జీవించాలని ఈ నెలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పంజాలో ప్రతిష్టించిన పీర్ల వద్ద విశేష ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో నగరంలోని పలువురు హిందువులు కూడా పాల్గొనడం విశేషం. అనంతరం పంజాలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో సుమారు 1500 మంది పాల్గొని మౌలా అలీ మహాత్ముని ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అహలె సున్నతుల్ జమాత్ అధ్యక్షుడు షేక్ సాబీర్ హుస్సేన్, చప్పిడి సత్యనారాయణ, పంజా వంశపారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలి, ఎండీ గాలబ్ అలి, ఎండీ మౌలా అలి, ఎండీ ఖాదర్ అలి, ఎండీ నాసర్ అలీ, ఎండీ మున్వర్ అలీ, ఎండీ షాహేద్ అలీ, ఎండీ ఖాజా అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై సమరశీల పోరాటాలు



ఆటో డ్రైవర్లతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆటో డ్రైవర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సూరిబాబు, జె.గోపి తెలియజేశారు. ఏలూరు నగరం, చొదిమెళ్ల ఆటో స్టాండ్‌లకు చెందిన 20 మంది ఆటో డ్రైవర్లు సీఐటీయూలో చేరిన సందర్భంగా స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతనంగా యూనియన్‌లో చేరిన ఆటో డ్రైవర్లకు నాయకులు అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రైవర్లు అందరూ ఆటోరిక్షా కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రతి ఒక్కరూ యూనిఫామ్ ధరించాలని కోరారు. ఏలూరు నగరంలో సీసీ కెమేరాల ద్వారా విధించిన ఈ-చలానాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సమావేశంలో వై.బాలాజీ, జి.డేవిడ్ రాజు, వి.దుర్గారావు, ఎల్.వెంకటేశ్వరరావు, సీహెచ్ ప్రసాదరావు, ఎస్.చినబాబు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

దెందులూరు: కౌలు గుర్తింపు కార్డులకు కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.జితేంద్ర అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న కౌలు రైతు కార్డులను పొందేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది కౌలు రైతులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో సంబంధిత రైతుల ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలు సమర్పించాలన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	23

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	56	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	10, 12
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	44-64	కీరా దోస	54
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	170
క్యాబేజీ	38	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-50	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	56	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44

900 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి

దెందులూరు: మండలంలో 17 గ్రామ పంచాయతీలో ఇప్పటి వరకు 900 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 1,400 ఎకరాల్లో వరి సాగవుతుందని, ఇందులో 900 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో రైతులు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారని తెలిపారు. సాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

సీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుల కొరత

దెందులూరు: నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరులో స్టాఫ్ నర్సులు, నైట్ వాచ్‌మెన్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇక్కడ పని చేస్తున్న వైద్య సిబ్బందిపై అధిక పని భారం, రోగులకు అసౌకర్యం ఏర్పడుతోంది. ప్రతిరోజూ సీహెచ్‌సీలో 100-150 మంది పేషెంట్లు ఓపీ ఉంటోంది. అన్ని విభాగాల వైద్యులు సంతృప్తికరంగా వైద్య పరీక్షలు, సేవలు, శస్త్రచికిత్సలు అందించడంతో ఓపీ సంఖ్య గణనీయంగా పెరిగింది. సీహెచ్‌సీ నిబంధనల ప్రకారం వైద్యులతో పాటు స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, నైట్‌వాచ్‌మెన్లు పోస్టులు భర్తీ చేస్తే పూర్తిస్థాయి వైద్యసేవలు అందించే అవకాశం ఉంటుంది. సీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులకు అదనపు భారాన్ని తగ్గించేలా ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసి రోగులకు సకాలంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకుల బాలికల పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

దెందులూరు: మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకినాని కోరారు. ఆదివారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పెదవేగి మండలం వంగూరులో అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించాలని, శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. దెందులూరు మండలం వేగవరంలో హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించిన భవనాల్లో 2017 నుంచి అద్దె ప్రాతిపదికన జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇటీవల గురుకుల పాఠశాలను ఖాళీ చేయమని హేలాపురి యాజమాన్యం కోరారన్నారు. దీంతో వంగూరులో పాత ప్రైవేటు కళాశాలకు సంబంధించిన భవనంలోకి గురుకుల పాఠశాల మార్చారని పేర్కొన్నారు. అక్కడ పాముల బెడద ఉందని వివరించారు. 240 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఒక ప్రిన్సిపాల్ మినహా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అంతా పార్ట్‌టైం, కాంట్రాక్ట్ సిబ్బంది కావడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వివరించారన్నారు.

నేత్రదానం స్ఫూర్తిదాయకం

దెందులూరు: ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ కొలుసు నాగవెంకట సత్యనారాయణ (బాబూరావు) నేత్రదానం స్ఫూర్తిదాయకమని ఆర్టీసీ గన్నవరం సీటీఓ కొలుసు శ్రీరాములు అన్నారు. ఆయన ఆదివారం దెందులూరు యాదవుల వీధిలో బాబూరావు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు. మరణానంతరం మరొకరికి చూపు ప్రదానం చేయాలన్న మహోన్నత భావంతో బాబూరావు నేత్రాలను దానం చేయడం ఆర్టీసీ శాఖకు గర్వకారణంగా ఉందన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరు డిపో ఎంప్లాయీస్ యూనియన్, మజ్దూర్ యూనియన్ డ్రైవర్లు, కండక్టర్లు, వైఎస్సార్‌సీపీ నేత కొలుసు గణపతిరావు పరామర్శించారు.